శరన్నవరాత్రి వేడుకలకు సిద్ధం

- రాజాంలోని నవదుర్గ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- ఉత్తరాంధ్ర ముత్తయిదువుగా ఇక్కడి అమ్మవారికి గుర్తింపు
- నవదుర్గలతో కొలువైన ఆలయం
- ఏటా అంగరంగ వైభవంగా వేడుకలు
- రేపటి నుంచి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు



పూజలందుకుంటున్న నవదుర్గాదేవి అమ్మవారు



నవదుర్గ ఆలయం



బ్రహ్మీ | మహేశ్వరి | కౌమారి | వైష్ణవి
వారాహీ | ఇంద్రాణి | చాముండి | మహాలక్ష్మి

రాజాం సిటీ: దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాజాం బస్టాండ్ వద్ద ఉన్న నవదుర్గ మాత ఆలయం ముస్తాబవుతోంది. ప్రతీ సంవత్సరం దసరాకు నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఇక్కడి ఆచారం. ఈ ఏడాది కూడా ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయం వద్ద తొమ్మిది రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. దసరా రోజున రాజాంతో పాటు సమీప మండలాలకు చెందిన ప్రజలు ఆయుధపూజ నిమిత్తం బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలను ఇక్కడికి తీసుకువస్తుంటారు. అదే రోజున ఆలయ అర్చకులు నవదుర్గ అమ్మవారి నిజరూపదర్శనాన్ని భక్తులకు కల్పించనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు, ఈ ఏడాది అక్టోబర్ 2న అమ్మవారు నిజరూపదర్శనమిస్తారు. విజయదశమి మరుసటి రోజు కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకోవడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది.

ఆలయ విశిష్టత

రాజాంలోని నవదుర్గ మాత ఆలయం దేశంలోనే నవదుర్గలతో కూడిన రెండో ఆలయంగా చెబుతుంటారు. అందుకే ఈ ఆలయానికి విశిష్టత సంతరించుకుంది. తొమ్మిది ప్రాంతాల నుంచి నవదుర్గ అమ్మవారి విగ్రహాలను తీసుకువచ్చి ఇక్కడ ప్రాణప్రతిష్ఠ చేశారు.ఇక్కడ కొలువైన మూలవిరాట్‌కు శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే మూలవిరాట్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. దసరాకు భవానీమాల దీక్ష తీసుకున్న పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఇక్కడకు వచ్చి దీక్ష విరమణ చేస్తుంటారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



నవదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పిస్తాం. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశాం. తొమ్మిది రోజులుపాటు ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. పోలీస్ బందోబస్తు నడుమ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. – పొన్నాడ శ్యామలరావు, ఈఓ, నవదుర్గ ఆలయం, రాజాం

క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ హరిబాబు, తదితరులు

రాజాం సిటీ: రక్తదాతలు అభినందనీయులని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు అన్నారు. ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం చేసిన 30 మంది యువకులను అభినందించి, వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్ఎం జోగారావును సత్కరిస్తున్న ఎంఈఓ రమేష్,తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని నారసింహునిపేట ఉన్నతపాఠశాలలో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కొయ్యికొండవలస మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కె.జోగారావును పలు పాఠశాలల ఉపాధ్యాయులు,ఎంఈఓ సీహెచ్.రమేష్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ హెచ్ఎం జోగారావు తన సొంత నిధులతో పాఠశాలలో పిల్లల అవసరాలను తీర్చుతున్నారని కొనియాడారు. నారసింహునిపేట హైస్కూల్ హెచ్ఎం రామారావు, వివిధ సంఘాల ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలను గుర్తించాలి



మాట్లాడుతున్న బాడంగి ఎంపీడీఓ రామకృష్ణ

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి, అందుకు అనుగుణంగా సుస్థిర గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని బాడంగి ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సర్పంచ్‌లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తెర్లాం,మెంటాడ మండలాల ఎంపీటీలు, సర్పంచ్‌లకు సుస్థిర గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శనివారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీల ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడం, ఆర్థిక సంఘం, ఉపాధి నిధులతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనుల చేపట్టడంపై వివరించారు. బొబ్బిలి ఎంపీడీఓ పి.రవికుమార్,డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



రేగిడి: ఉంగరాడగ్రామ సచివాలయం వద్ద యూరియాకోసం క్యూలో ఉన్న రైతులు

రేగిడి: మండల రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. ఉంగరాడగ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం రైతులు శనివారం పడిగాపులు కాశారు. సచివాలయ సిబ్బంది యూరియా పంపిణీ చేయగా అధిక సంఖ్యలో రైతులు రావడం, తక్కువ స్టాక్ ఉండడంతో సిబ్బందికి ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి తలెత్తింది. వన్‌బీ ఉన్న రైతులకు మాత్రమే ఒక్కో యూరియా బస్తా అందజేశారు. వన్‌బీ తీసుకురాని రైతులకు యూరియా ఇవ్వకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. యూరియా పంపిణీని ఏఓ బి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

తాగునీరు,వీధి లైట్ల సమస్య రాకూడదు

బొబ్బిలి: మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ విషయంలో ఎటువంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. డీఈఈ కిరణ్‌కుమార్,ఏఈలు వి.వి.ఎస్.ఎన్.గుప్త, ఏ.ఎస్.కోటేశ్వర రావు,సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఆరికతోట విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు

రామభద్రపురం: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొత్స రత్నకిశోర్ శనివారం తెలిపారు.ఇటీవల ఇదే పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14,17,19 విభాగాల బాల,బాలికల జూడో పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. అండర్-14 విభాగంలో భానుశ్రీ, అండర్-17 విభాగంలో గుణవర్ధిని,వేదశ్రీ, ఫాతిమా, జయశ్రీ శిరీష,ప్రేమ సాగర్ ఎంపికకాగా అండర్-19 విభాగంలో చిన యోగానంద నాయుడు, తూముల సంతోష్ ఎంపికయ్యారు.అలాగే అండర్-17 విభాగంలో టేబుల్ టెన్నిస్‌లో కనకల గీతిక రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. వీరంతా వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను హెచ్ఎం జి.కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలతోనే మనుగడ

మొక్కల పెంపకంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం మొక్కలు నాటారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను, పార్కులను శుభ్రం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వంగర: మొక్కలు నాటుతున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ, అధికారులు



రేగిడి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి, తదితరులు



బొబ్బిలి: బొబ్బిలిలోని మల్లమ్మదేవి పార్కులో చెత్తను ఏరుతున్న సచివాలయ ఉద్యోగులు



బాడంగి: చినభీమవరం అంగన్‌వాడీ కేంద్రంవద్ద మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ శారదాదేవి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: పట్టణంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్తగా 11కేవీ బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ బి.రఘు శనివారం ఓప్రకటనలో తెలిపారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఫీడర్,ఫూల్‌బాగ్, టీటీడీ ఫీడర్ల పరిధి ప్రాంతాలకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజాం పట్టణంలో..

రాజాం సిటీ: రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్పు చేస్తున్న నేపథ్యంలో పట్టణంలోని పాలకొండ రోడ్డులో అన్ని ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ ఓ.జె.సి.ఏ.కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పుల్లిట గ్రామానికి చెందిన ప్రమోదుల ఆశాజ్యోతిపై అదే గ్రామానికి చెందిన కుప్పిలి అన్నారావు కొడవలితో దాడి చేశాడని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు... శుక్రవారం సాయంత్రం ఆశాజ్యోతి రోడ్డుపై వెళుతుండగా వెనుక తన పిల్లలు వెంటపడ్డారు. అదేరోడ్డులో అన్నారావు ఆవులు తోలుకొని వస్తుండడంతో ముందున్న పిల్లలకు అవి పొడిచేస్తాయేమనని, వాటిని పక్కకు తోలాలని ఆశాజ్యోతి అన్నారావుకు చెప్పడంతో గొడవ మొదలైంది. అన్నారావు కొడవలితో ఆశాజ్యోతిపై దాడిచేయడంతో చెవి దగ్గర గాయమై ఆస్పత్రిలో చేరింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వ్యవసాయం మానేయాల్సిందేనా..?

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
- యూరియా కొరతపై ఏఓను నిలదీసిన సభ్యులు



యూరియా కొరతపై సభలో నిలదీస్తున్న సభ్యులు

సంతకవిటి: యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ చేతకాని తనం వల్ల రైతులు వ్యవసాయం మానే యాలా అని మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా అధికారు లు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యవసాయ అధికారి సి.బి.యశ్వంత రావు వ్యవసాయ శాఖ గురించి వివరిస్తుండగా..సభ్యులు యూరియా కొరతపై నిలదీశారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో వరి, మొక్కజొన్న, పత్తి దాదాపు 19, 372 ఎకరాల్లో సాగులో ఉందని, దాదాపు 1636 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 1,171 మెట్రిక్ టన్నులు వచ్చిందని తెలిపారు. ఇంకా 465 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని చెప్పగా...ఇంతలో రామారాయపురం సర్పంచ్(టీడీపీ) దేవబారికి అప్పారావు కలుగుజేసుకుని ఇప్పటి వరకు తనకు ఒక్క యూరియా బస్తా కూడా అందలేదని, వరి పంట పొట్ట దశలో ఉందని,ఈసమయంలో యూరియా వేయక పోతే పంట దిగుబడి రాదని అన్నారు. ఇలా అయితే ఎలా అని, వ్యవసాయం మానేయాలా అని విరుచుకుపడ్డారు. తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు మాట్లాడుతూ తాలాడలో దాదాపు 1,100 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటే 220 బస్తాల యూరియా మాత్రమే అందించడం అన్యాయమని, రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యమా, లేక అధికారులు నివేదికలు పంపించడంలో లోపమా అని ప్రశ్నించారు.

గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించరేం..?

గృహ నిర్మాణాలపై సమీక్షలో ఏఈ కనకయ్యకు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని అడగగా బిల్లులు పెడతామని ఏఈ సమాధానం ఇచ్చారు. ఇన్ని రోజులు ఎందుకు పెట్టలేదని జెడ్పీ వైస్ చైర్మన్ ఎదురు ప్రశ్నించగా ఏఈ మౌనంగా ఉండిపోయారు. బిల్లుల కోసం లబ్ధిదారులు టీడీపీ కూటమి నాయకులను కలవాలా అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై జరిగిన సమీక్షలో ఆ పథకం ఏపీఓ ఆర్.హరనాథరావు మాట్లాడుతూ ఆగస్టు 16 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు డబ్బులు జమ య్యాయని సభకు తెలిపారు.రోడ్లు, భవనాల శాఖపై సమీక్షలో తాలాడ నుంచి మండాకురిటి వరకు ఆర్‌అండ్‌బీరోడ్డు మరమ్మతులపై ఏఈ సతీష్‌ను మండాకురిటి సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వర రావు ప్రశ్నించగా త్వరలో పనులు ప్రారంభిస్తామని బదులిచ్చారు. తమ గ్రామానికి మద్దువలస కాలువ ద్వారా ఈ సంవత్సరం చుక్క నీరు అందలేదని, అలాంటప్పుడు నీరు తీరువా ఎలా వసూలు చేస్తారని నీటి పారుదలశాఖ ఏఈ రవీంద్రను జి.ఎన్.పురం సర్పంచ్ పప్పల ఈశ్వరరావు ప్రశ్నించారు. జెడ్పీ వైస్ చైర్మన్ జోక్యం చేసుకుని కాలువల సామర్థ్యాన్ని 650 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కులకు పెంచి మండలంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ పందు పాపారావు పాల్గొన్నారు.

దయచేసి పాఠాలు చెప్పే అవకాశం ఇవ్వండి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, పిల్లలకు పాఠాలు చెప్పే అవకాశం కల్పించాలని ఫ్యాప్టో నాయకుడు జె.సి.రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ఫ్యాప్టో నేతలు శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జె.సి.రాజు మాట్లాడుతూ పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు బోధనే తర పనులతో బిజీగా ఉండడంతో పిల్లల చదువులు అటకెక్కుతున్నాయన్నారు.అలాగే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. దసరా సెలవులు పెంచాలని ఉపాధ్యాయులు ఎవరూ కోరలేద ని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని,సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు మెమో నెంబర్ 57ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిల చెల్లింపుతో పాటు యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకై వచ్చే నెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో నాయకులు బి.రవికుమార్, సుధాకర్,సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

2.0 విధానాన్ని ఎత్తి వేయాలి



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

బొబ్బిలి: ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2.0 విధానం ప్రవేశపెట్టడం వల్ల సాంకేతికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దస్తావేజు లేఖర్లు వాపోయారు. శనివారం వారంతా పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి డాక్యుమెంట్‌లు రాయలేదు.స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల సెల్‌ఫోన్ లేని పేద, మధ్య తరగతి రైతులు, ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ జరగడం లేదన్నారు. కొత్త విధానం వల్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ తప్పనిసరి చేశారని, సెల్ ఫోన్ లేని పేద, మధ్యతరగతి రైతుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ఈ ఓటీపీ విధానాన్ని వెంటనే తొలగించాలని కోరారు. శనివారం ఎవరూ డాక్యుమెంట్లు రాయకుండా నిరసన తెలిపి ఇళ్లకు వెళ్లిపోయారు.సంకిలి రత్న సభాపతి, పక్కి పార్థసారధి,గొర్జి రఘుకుమార్, పరువాడ సతీష్ కుమార్,అరసాడ రవి,శ్రీపతి రామమోహనరావు, జుత్తాడ కొండలరావు, తదితరులు పాల్గొ న్నారు.

విద్య వ్యాపారంగా మారిపోయింది

- యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా ప్రమోషన్‌లో ఆర్.నారాయణమూర్తి



మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

రాజాం: ఒకప్పుడు సేవా రంగంగా ఉన్న విద్య ఇప్పుడు పూర్తిస్థాయిలో వ్యాపార రంగంగా మారిపోయిందని ప్రముఖ సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా రాజాం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాజాం ప్రాంతీయ సామాజిక సంఘాల ప్రతినిధులు, విశ్లేషకులు, కవులు, రచయితలు, సామాజిక సేవా కార్యకర్తలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలనే ఇతి వృత్తాలుగా చేసుకుని, ప్రజలను చైతన్యం చేయడంలో భాగంగా సినిమాలు చేస్తున్నామని తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చేశారని, కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల ముసుగులో తల్లిదండ్రుల ఆలోచనా విధానాన్ని మార్చేస్తున్నాయని, కష్టపడి చదువుకుంటున్న విద్యార్థులకు ఇది తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. గుజరాత్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర ప్రాంతాల్లో పేపర్ లీకేజీ అంశాలు బయటపడ్డాయని, దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో లోపాలను ఈ లికేజీలు స్పష్టంచేస్తున్నాయని అన్నారు. ఈ లీకేజీలు వల్ల అనర్హులు ఉద్యోగాలు పొంది, అర్హులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానం వల్ల సమాజం ఎంత నష్టపోతుందో తెలిపే అంశంతో ఈ సినిమా తీయడం జరిగిందని వివరించారు. పౌరుషాలకు అడ్డ రాజాం గడ్డ అని తెలిపారు. బొబ్బిలిపులిగా పేరుగాంచిన తాండ్ర పాపారాయుడు జన్మించిన నేల అని కొనియాడారు. కళాకారులను, వ్యాపారవేత్తలను అందించిన ఘనత రాజాంకు ఉందని, రాజాం ప్రాంతంలో ఎంతోమంది సామాజిక సేవా కార్యకర్తలు ఉన్నారని గుర్తు చేశారు. తన సినిమా ప్రమోషన్ విషయంలో సామాజిక సేవా కార్యకర్తలు, ప్రేక్షకులు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూడాలని కోరారు. రాజాంకు చెందిన ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ మరిశర్ల గంగారావు మాస్టారు, కల్కి జ్యూయలరీ అధినేత కొత్త మధుసూదనరావు, పెంకి చైతన్యకుమార్, ఆర్.వి.జె.నాయుడు, బి.వి.అచ్యుత్‌కుమార్, సినీనటి బొల్లా లలితకుమారి ,తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



బొబ్బిలిరూరల్: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘువంశీ



వంగర: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, కిశోర బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో శనివారం మహిళల కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు.మహిళలకు సోకుతున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించా రు. క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తించడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. అనంతరం మహిళలకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

తలగాం గ్రామంలో...

వంగర: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి తలగాం గ్రామంలో వంగర పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించి. శిబిరంలో సుమారు 100 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

రామభద్రపురం: పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై మండల కేంద్రంలో ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్ల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోందని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల బెడద ఉండదని, జీరో విద్యుత్ బిల్లులు రావడానికి ఇదో సువర్ణవకాశమన్నారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది బి.విజయకుమార్,జి.మోహనయ్య,సీహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న వైద్యాధికారి రీణాచౌదరి

రేగిడి: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీణాచౌదరి అన్నారు.స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూరాడలో శనివారం వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్ మోహనరావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి సునీల్ కుమార్, ఈఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.